క్లుప్తంగా

మంగరాయుడికి వెన్న అలంకరణ



ఆదోని అర్బన్: పట్టణ శివారులోని శ్రీ మంగరాయ కాలనీలో వెలిసిన శ్రీ మంగరాయ ఆంజనేయస్వామి ఆదివారం భక్తులకు వెన్న అలంకారంలో దర్శనమిచ్చారు. ఆలయ మేనేజర్ భీమసేన ఆధ్వర్యంలో పూజారులు గురురాజ ఆచారి, అక్షయ్‌లు స్వామివారికి పంచామృతాభిషేకం, తేనాభిషేకం, భక్తులు తెచ్చిన ఏడున్నర కేజీల వెన్నతో అలంకరించారు. అనంతరం స్వామివారికి నైవేద్యం, మహామంగళహారతితో పూజలు చేశారు.

విప్ జారీ చేసిన కౌన్సిలర్ వై.జి.బాలాజీ



విప్ పేపర్లను సబ్‌కలెక్టర్‌కు అందజేస్తున్న కౌన్సిలర్ వై.జి.బాలాజీ తదితరులు

ఆదోని టౌన్: ఆదోని మున్సిపాలిటీ చైర్మన్ ఎన్నిక ఈనెల 19న (సోమవారం) జరగనుంది. ఈ నేపథ్యంలో వైఎస్సార్‌సీపీ కౌన్సిలర్లకు కౌన్సిలర్ వై.జి.బాలాజీ విప్ జారీ చేశారు. ఈ మేరకు ఆదివారం విప్ పేపర్లను సబ్‌కలెక్టర్ మౌర్యభరద్వాజ్‌కు అందజేశారు. కార్యక్రమంలో వైస్ చైర్మన్ నరసింహులు, కౌన్సిలర్ బాలాజీ, ఫయాజ్‌అహ్మద్, అశోక్, గోవిందరాజు తదితరులు పాల్గొన్నారు.

పరామర్శ



రామకృష్ణను పరామర్శిస్తున్న ఎమ్మెల్యే వై.బాలనాగిరెడ్డి

మంత్రాలయం : మండల కేంద్రంలోని రామచంద్ర నగర్‌లో పలువురిని ఎమ్మెల్యే వై.బాలనాగిరెడ్డి పరామర్శించారు. కాలనీకి చెందిన రామకృష్ణ, వడ్డె బాలరాజు అనారోగ్యంతో కొన్నాళ్లుగా బాధపడుతున్నారు. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే ఆదివారం వారి ఇళ్లకు వెళ్లి పరామర్శించారు. కుటుంబ సభ్యులకు ధైర్యం చెప్పారు. ఆరోగ్యాన్ని బాగా చూసుకోవాలని సూచించారు. పరామర్శలో ఎమ్మెల్యేతోపాటు వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ భీమారెడ్డి, సర్పంచు తెల్లబండ్ల భీమయ్య, నాయకులు వడ్డె నారాయణ ఉన్నారు.

శ్రీమఠంలో వనపర్తి జిల్లా ఎస్పీ



శ్రీమఠం ప్రాంగణంలో ఎస్పీ గిరిధర్ కుటుంబ సభ్యులు

మంత్రాలయం రూరల్ : శ్రీరాఘవేంద్రస్వామి దర్శనార్థం తెలంగాణ రాష్ట్రం వనపర్తి జిల్లా ఎస్పీ గిరిధర్ కుటుంబ సభ్యులతో మంత్రాలయం విచ్చేశారు. ముందుగా వారు గ్రామ దేవత మంచాలమ్మకు అర్చనతోపాటు హారతులు పట్టి మొక్కులు తీర్చుకున్నారు. అనంతరం రాఘవేంద్రుల బృందావన దర్శనం చేసుకుని ప్రత్యేక పూజలు చేసుకున్నారు. శ్రీమఠం ధార్మిక సహాయక అధికారి వ్యాసరాజాచార్ క్షేత్ర మర్యాదలతో ఆహ్వానం పలికారు.

అవోపా కార్యవర్గ ప్రమాణ స్వీకారం



అధ్యక్షుడు శ్రీనాథ్‌గుప్తాతో ప్రమాణస్వీకారం చేయిస్తున్న అవోపా సెక్రటరీ సుబ్బారావు

ఆదోని అర్బన్: పట్టణంలోని ఆర్యవైశ్య అఫీషియల్స్ ప్రొఫెషనల్స్ అసోసియేషన్ (అవోపా) అధ్యక్షులు, కార్యవర్గ సభ్యుల ప్రమాణ స్వీకార కార్యక్రమం ఆదివారం స్థానిక మెట్రో ఫంక్షన్ హాలులో జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ఏపీ అవోపా సెక్రటరీ సుబ్బారావు, కన్వీనర్‌లు ప్రతాప్ శ్రీకాంత్, వెంకటేశ్వర్లు, మాజీ ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు కాకుబాళ్ నగేష్ హాజరయ్యారు. పట్టణ అవోపా అధ్యక్షుడిగా ఎన్నికైన శ్రీనాథ్‌గుప్త, మహిళా అధ్యక్షురాలిగా వంకదారు మమతశ్రీలతో వారు ప్రమాణ స్వీకారం చేయించారు. అదేవిధంగా కార్యదర్శిగా రఘు, కోశాధికారిగా వెంకటేశ్వర్లతో పాటు 15 మందిని కార్యవర్గ సభ్యులుగా ప్రమాణ స్వీకారం చేయించారు. మహిళా విభాగంలో 13 మంది కార్యవర్గ సభ్యుల చేత ప్రమాణ స్వీకారం చేయించారు.

మార్కెట్‌యార్డు మాజీ చైర్మన్ మృతి

ఆదోని టౌన్: ఆదోని మాజీ మార్కెట్‌యార్డు చైర్మన్ కురువ రాముడు అనారోగ్యంతో శనివారం అర్ధరాత్రి మృతిచెందారు. విషయం తెలుసుకున్న మాజీ ఎమ్మెల్యే సాయిప్రసాద్‌రెడ్డి బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. కురువ రాముడు మృతదేహంపై పూలమాలలు వేసి నివాళులర్పించారు. మాజీ ఎమ్మెల్యే మాట్లాడుతూ వైఎస్సార్‌సీపీలో ఉంటూ కురువ రాముడు ఎన్నో సేవలు అందించాడన్నారు.

భవితవ్యం ప్రశ్నార్థకం?

- 20ఏళ్లుగా అరకొర వేతనంతో నెట్టుకొస్తున్న విద్యుత్ మీటర్ రీడర్లు
- వేతనాల పెంపుపై జీఓ విడుదల చేసిన గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం
- కూటమి ప్రభుత్వం వచ్చాక పట్టించుకోని వైనం
- స్మార్ట్ మీటర్ల రాకతో విద్యుత్ మీటర్ రీడర్లకు కరువైన ఉద్యోగ భద్రత
- ప్రత్యామ్నాయం చూపాలంటున్న మీటర్ రీడర్లు

ఎమ్మిగనూరుటౌన్: ప్రతినెలా మొదటి వారంలో ఇంటింటికి వెళ్లి విద్యుత్ మీటర్ రీడింగ్ తీసి విద్యుత్ బిల్లులు వినియోగదారుడికి ఇచ్చే మీటర్ రీడర్‌లపై కూటమి ప్రభుత్వం వివక్ష చూపుతోంది. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ఇచ్చిన వేతనం కంటే తక్కువగా ఇస్తుండటంతో కుటుంబాలను పోషించుకోవాలని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అలాగే స్మార్ట్ మీటర్లు ఉపయోగంలోకి వస్తే తమకు ఉద్యోగ భద్రత ఎక్కడ వుంటుందని వారు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

జిల్లాలో 470 మంది విద్యుత్ మీటర్ రీడర్లు

ఉమ్మడి కర్నూలు జిల్లాలో 470 మంది విద్యుత్‌మీటర్ రీడర్లు పనిచేస్తున్నారు. వీరు ప్రతి నెలా పట్టణాలు, నగరాల్లో ప్రతి ఇంటికి వెళ్లి విద్యుత్ మీటర్ రీడింగ్ తీస్తే ఒక్కో మీటర్ రీడింగ్‌కు రూ.3.60పైసలు, గ్రామాల్లో ఒక్కో మీటర్ రీడింగ్‌కు రూ.3.70పైసలు ఇవ్వాలని విద్యుత్ సంస్థ సంబంధిత కాంట్రాక్టర్లకు నిర్దేశించింది. అయితే కాంట్రాక్టర్లు మాత్రం ప్రస్తుతం పట్టణాల్లో రూ.3, గ్రామాల్లో ఒక్కో మీటర్ రీడింగ్‌కు రూ 3.10 మాత్రమే ఇస్తున్నారు. నిబంధనల మేరకు రీడింగ్ తీసేందుకు గాను కాంట్రాక్టర్లే రీడర్లకు రీడింగ్ పరికరాలు, మొబైల్ ఫోన్ ఇవ్వాల్సివుండగా.. వాటిని ఇవ్వడం లేదని, మరికొందరు కాంట్రాక్టర్లు పరికరాలు ఇచ్చి వేతనాల్లో ప్రతి నెలా కోత పెడుతున్నారని రీడర్లు వాపోతున్నారు.



ఎమ్మిగనూరులో విద్యుత్ మీటర్ రీడింగ్ తీస్తున్న దృశ్యం

వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో జీఓ...

మీటర్ రీడింగ్ ద్వారా ఇచ్చే నగదు తమ కుటుంబ పోషణకు సరిపోవడం లేదని వేతనాలు ఇవ్వాలని కోరుతూ మీటర్ రీడర్ల సంఘం గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లగా.. వేతనాలు ఎస్కో ద్వారా ఇచ్చేందుకు మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం హామీ ఇచ్చింది. అందుకు సంబంధించి జీఓలు కూడా విడుదల చేసిందని సంఘ నాయకులు పేర్కొంటున్నారు. అయితే అది అమలయ్యేలోగా ఎన్నికలొచ్చి నిలిచిపోయిందని, ప్రస్తుతం కూటమి ప్రభుత్వ దృష్టికి తమ గోడు వెళ్లబోసుకున్నా పట్టించుకోవడం లేదని వారు వాపోతున్నారు. పనిచేస్తే చేయండి లేకపోతే వెళ్లిపోండి అంటూ అధికారులు సైతం తెగేసిచెబుతున్నారని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

స్మార్ట్ మీటర్లతో ఉద్యోగ భద్రత కరువు

కర్నూలు జిల్లాలో పనిచేస్తున్న 470 మంది మీటర్ రీడర్లు ఉద్యోగ భద్రతపై ఆందోళన చెందుతున్నారు. గత ప్రభుత్వం స్మార్ట్‌మీటర్ల ఏర్పాటు చేసేందుకు ముందుకెళితే ప్రతిపక్ష నేతగా వున్న ప్రస్తుత సీఎం చంద్రబాబునాయుడు ఆ ప్రక్రియను తీవ్రంగా వ్యతిరేకించి ఇప్పుడు అధికారంలోకి వచ్చిన తరువాత ఆ విధానాన్నే అమలు చేస్తూ తమ కడుపుకొట్టేందుకు చర్యలు తీసుకుంటున్నారని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. స్మార్ట్ మీటర్ల ఏర్పాటుతో మోబైల్ రీచార్జ్ మాదిరిగా విద్యుత్ వాడకాన్ని కూడా రీచార్జ్ చేసుకొనే విధానం అమలులోకి వస్తే 15 ఏళ్ల, 20 ఏళ్ల పై బడి మీటర్ రీడర్లుగా పనిచేసిన తాము తమ కుటుంబాలతో రోడ్డున పడే దుస్థితి వస్తుందని వాపోతున్నారు. ఈ విషయంపై ప్రభుత్వం దృష్టికి, ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లామని, అయినా ఎలాంటి స్పందన లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. స్మార్ట్ మీటర్లు వస్తే తమకు ప్రత్యామ్నాయంగా విద్యుత్ శాఖలో ఉపాధి చూపుతామని చెప్పిన ప్రభుత్వం ఆ దిశగా అడుగులు వేయడంలేదని ఆగ్రహం వ్యక్యం చేస్తున్నారు.

17 సంవత్సరాలుగా పనిచేస్తున్నా



విద్యుత్‌మీటర్ రీడర్‌గా పట్టణంలో గత 17 సంవత్సరాలుగా పని చేస్తున్నా. ప్రభుత్వం మాలాంటి వారిపై దయ చూపి ఉద్యోగ భద్రత కల్పించి కనీస వేతనం ఇచ్చేలా చర్యలు తీసుకోవాలి. ఏళ్ల తరబడి పనిచేసే తమ లాంటి కార్మికులకు న్యాయం చేస్తేనే మా కుటుంబాలకు భవిష్యత్ వుంటుంది.

– కనికె చంద్రశేఖర్, మీటర్ రీడర్, ఎమ్మిగనూరు

ఉద్యోగ భద్రత కల్పించాలి



విద్యుత్ మీటర్ రీడర్లకు కూటమి ప్రభుత్వం ఉద్యోగ భద్రత కల్పించాలి. మీటర్ రీడింగ్ ఇచ్చే నగదును పెంచాలి. లేదా ప్రభుత్వమే తమ ఖాతాలకు వేతనాలు జమ చేస్తే మీటర్ రీడర్లలో అభద్రతా భావం పోతుంది. ఆ దిశగా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలి. స్మార్ట్ మీటర్లు ఏర్పాటు చేస్తే ప్రత్యామ్నాయంగా సబ్‌స్టేషన్లలో ఉద్యోగాలు కల్పించి రీడర్ల కుటుంబాలను ఆదుకోవాలి.

– డి.నరసింహారెడ్డి, విద్యుత్ మీటర్ రీడర్ల సంఘ కర్నూలు జిల్లా వర్కింగ్ ప్రసిడెంట్ నాయకుడు

మీటర్ రీడింగ్ ధర పెంచాలి



మీటర్ రీడింగ్ ధర పెంచి వేతనాలు ఇవ్వాలి. 15 సంవత్సరాలుగా విద్యుత్ మీటర్ రీడర్‌గా రూరల్‌లో పని చేస్తున్నాను. ఇచ్చే వేతనాల్లోను కోతలు విధించకుండా చర్యలు తీసుకొని మాకు ఉద్యోగ భద్రత కల్పించాలి. ఇచ్చిన హామీని ప్రభుత్వం నిలబెట్టుకోవాలి.

– కె.వీరేష్ ,విద్యుత్ మీటర్ రీడర్, ఎమ్మిగనూరు



జాతీయ జెండాలతో ఎమ్మెల్యే పార్థసారథి, పెద్ద ఎత్తున పాల్గొన్న ప్రజలు, ప్రజా సంఘాల నాయకులు

ఆదోనిలో తిరంగా ర్యాలీ



తిరంగా ర్యాలీలో పాల్గొన్న మాజీ ఎమ్మెల్యే సాయిప్రసాద్‌రెడ్డి

ఆదోని టౌన్: భారత సైన్యం పాకిస్తాన్ ఉగ్రవాద స్థావరాలను ధ్వంసం చేసి పాకిస్తాన్‌కు గుణపాఠం చెప్పడంతో ఆదివారం ఆదోని పట్టణంలో జాతీయ జెండాలను చేతబట్టి తిరంగా ర్యాలీ చేపట్టారు. పార్టీలకు, మతాలు, కులాలకు అతీతంగా వేలాది మంది ప్రజలు జాతీయ జెండాలు చేత పట్టుకుని ర్యాలీలో పాల్గొన్నారు. ర్యాలీలో ఎమ్మెల్యే పార్థసారథి, మాజీ ఎమ్మెల్యే వై.సాయిప్రసాద్‌రెడ్డి, ప్రజా సంఘాల నాయకులు హాజరయ్యారు. ఆయన మాట్లాడుతూ పహల్గాం ఉగ్రదాడిని తిప్పికొడుతూ ఉగ్రవాదులను మట్టుబెట్టడంలో భారత సైన్యం తీసుకున్న చర్యలు అద్భుతమన్నారు.

వీర జవాన్ కుటుంబానికి రూ.లక్ష సాయం ప్రకటించిన మాజీ ఎమ్మెల్యే

భారత్–పాకిస్థాన్ యుద్ధంలో అమరుడైన సత్యసాయి జిల్లాకు చెందిన భారత జవాన్ మురళీ నాయక్ కుటుంబానికి అండగా ఉంటామని వైఎస్సార్‌సీపీ ఆదోని మాజీ ఎమ్మెల్యే వై.సాయిప్రసాద్‌రెడ్డి అన్నారు. ఆయన మాట్లాడుతూ.. భారత సైన్యం ధైర్యసాహసాలను కొనియాడారు. పాక్ ఉగ్రవాదులను మట్టుపెట్టే క్రమంలో మురళీనాయక్ అమరుడయ్యాడన్నారు. ఆయన కుటుంబానికి తనవంతుగా రూ.లక్ష సాయం అందించనున్నట్లు చెప్పారు. త్వరలోనే బాధితా కుటుంబాన్ని కలిసి చెక్కును అందజేస్తానని చెప్పారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు చంద్రకాంత్‌రెడ్డి, మున్సిపల్ కౌన్సిలర్లు నరసింహులు, సందీప్‌రెడ్డి, రాజేశ్వరరెడ్డి, గురునాథ్‌రెడ్డి, అశోక్, చలపతి, నూతన మున్సిపల్ చైర్‌పర్సన్ అభ్యర్థి లోకేశ్వరి నాగరాజ్, కాంగ్రెస్ పార్టీ, జనసేన, ప్రజా సంఘాల నాయకులు, ప్రజలు స్వచ్ఛందంగా పాల్గొన్నారు.



కోసిగిలో జాతీయ జెండాలతో ర్యాలీ చేస్తున్న దృశ్యం

సైనికులకు సంఘీభావంగా ర్యాలీ

కోసిగి : ఆపరేషన్ సింధూర్‌లో విజయం సాధించిన సైనికులకు, యుద్ధంలో ప్రాణాలు కోల్పోయిన వీర జవాన్‌లకు సంఘీభావం తెలుపుతూ కూటమి నేతలు ర్యాలీ చేపట్టారు. ఆదివారం పట్టణంలోని స్థానిక మార్కండేయ స్వామి ఆలయం నుంచి బస్టాండ్ మీదుగా వాల్మీకి సర్కిల్ వరకు జాతీయ జెండాలతో ర్యాలీ నిర్వహించారు. సర్కిల్ మానవహారంగా ఏర్పడి జోహార్లు పలికారు. ర్యాలీలో టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ ఎన్.రాఘవేంద్రరెడ్డి, మండల నాయకులు ముత్తురెడ్డి, రామిరెడ్డి, జ్ఞానేష్ బీజేపీ నేత రాముడు తదితరులు పాల్గొన్నారు.

రవాణా శాఖను ప్రవేటీకరించొద్దు

ఎమ్మిగనూరుటౌన్: రవాణా శాఖ నిబంధనలను మార్చి ప్రైవేట్‌కు అప్పగించే ప్రక్రియను ప్రభుత్వం మానుకోవాలని సీఐటీయూ తాలూకా కార్యదర్శి రాముడు కోరారు. ఆదివారం స్థానిక కార్యాలయం వద్ద ఆటో కార్మికులతో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. రవాణా శాఖను ఓలా, రాపిడో సంస్థలకు అప్పగించే ప్రక్రియను నిలిపివేయాలంటూ కరపత్రాలను ఆవిష్కరించారు. ఆటో కార్మికులపై భారాన్ని తగ్గించేలా పెట్రోల్, డీజిల్‌పై జీఎస్టీని తొలగించాలన్నారు. కేంద్రప్రభుత్వం తెచ్చిన కొత్త కార్మిక చట్టాలను రద్దు చేయాలని ఇందుకై మంగళవారం చేపట్టే దేశ వ్యాప్త సమ్మెలో అన్ని కార్మిక వర్గాలు పెద్ద ఎత్తునా పాల్గొనాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సీఐటీయూ ఆటో కార్మిక సంఘ నాయకులు వేణు, బాలు, షబ్బీర్, ఈరన్న తదితరులు పాల్గొన్నారు.

హక్కులను కాలరాస్తే సహించం

ఎమ్మిగనూరుటౌన్: విద్యాశాఖలో ఎస్సీ,ఎస్టీ ఉపాధ్యాయుల హక్కులను కాలరాస్తే సహించేది లేదని కేవీపీఎస్ జిల్లా అధ్యక్షుడు దేవసహాయం, దళిత రచయితల సంఘం వ్యవస్థాపక అధ్యక్షుడు భాస్కర్ అన్నారు. ఆదివారం స్థానిక కార్యాలయంలో వారు విలేకరుల సమావేశంలో మాట్లాడారు. 1977లో జారీ అయిన ఉత్తర్వుల మేరకు పదోన్నతులకై ఉన్నత చదువులు చదివేందుకు రెండు సంవత్సరాల స్టడీ లీవ్ ఇవ్వడం జరిగిందన్నారు. ఆ మేరకు ఆయా ఉపాధ్యాయులు నిబంధనల మేరకు తమకున్న హక్కులను వినియోగించుకుంటే వారు ఉద్యోగం చేసే స్థానాలను బదిలీల్లో ఖాళీలుగా చూపించేందుకు ప్రస్తుత విద్యాశాఖ పూనుకోవడం సమంజసం కాదన్నారు. ఆవిధంగా చేయడం ద్వారా స్టడీ లీవ్‌లో వెళ్లివచ్చిన తరువాత సుదూర ప్రాంతాల్లోని వేరే స్థానాల్లో వెళ్లాల్సివస్తుందని అన్నారు. ఎస్సీ,ఎస్టీ ఉపాధ్యాయుల హక్కులకు భంగం కలిగేలా వున్న ఈ నిబంధనను ప్రభుత్వం తొలగించాలని డిమాండ్ చేశారు.

పార్కులో సౌకర్యాలు కల్పించాలి



ఎంఎస్ పార్కులో విరిగిన ఆట,వ్యాయామ వస్తువులను పరిశీలిస్తున్న బుట్టా శివనీలకంఠ,పార్టీ నాయకులు



దైవందిన్నె గ్రామంలో శ్రీకనకదాసు ఆలయంలో శిఖర ప్రతిష్ఠ పూజ చేస్తున్న బుట్టాశివనీలకంఠ

ఎమ్మిగనూరుటౌన్: పట్టణంలోని ఎంఎస్ పార్కులో సౌకర్యాలు కల్పించాలని వైఎస్సార్‌సీపీ నాయకుడు, బుట్టా ఫౌండేషన్ అధినేత బుట్టా శివనీలకంఠ డిమాండ్ చేశారు. ఆదివారం వైఎస్సార్‌సీపీ నాయకులతో కలిసి పార్కును సందర్శించారు. పార్కులోని పిల్లల ఆట వస్తువులు, వ్యాయామ వస్తువులు విరిగిపోయి ఉండటాన్ని, కనీస సౌకర్యాలు లేకపోవడం గమనించారు. ఆయన మాట్లాడుతూ పట్టణ వాసులు విశ్రాంతి కోసం సేద తీర్చేందుకు పార్కుకు వస్తే ఇక్కడ సౌకర్యాలు లేవన్నారు. సత్వరం అధికారులు ఆయా వస్తువులకు మరమ్మతులు చేయించాలని సూచించారు. పార్కులో విద్యుత్ వైర్లు ప్రమాదకరంగా వున్నాయని, ప్రహరీ వెంట పేరుకొని పోయిన మురుగు, చెత్తను తొలగించాలన్నారు. కార్యక్రమంలో ఆయన వెంట వైఎస్సార్‌సీపీ చేనేత విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మాచాని వెంకటేష్, జిల్లా కార్యదర్శి యూకే రాజశేఖర్, పార్టీ జిల్లా అధికార ప్రతినిధి సునీల్‌కుమార్, నాయకులు విశ్వనాథ్‌రమేష్, పాలశ్రీనివాసరెడ్డి, కోటకొండనరసింహులు, నాగేంద్ర, షరీఫ్, రఘు, ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.

కనకదాస ఆలయంలో పూజలు

ఎమ్మిగనూరురూరల్: మండల పరిధిలోని దైవందిన్నె గ్రామంలో ఆదివారం జరిగిన శ్రీ కనకదాసుల ఆలయ శిఖర ప్రతిష్ఠ మహోత్సవ కార్యక్రమానికి వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు బుట్టా శివనీలకంఠ హాజరయ్యారు. ముందుగా గ్రామ పెద్ద జానకీరామిరెడ్డి ఆధ్వర్యంలో నాయకులు బుట్టా శివనీలకంఠకు ఘన స్వాగతం పలికారు. దేవాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో నాయకులు ఈరన్న, నరసింహులు, సోములు, జిల్లా ఆర్గనైజింగ్ కార్యదర్శి రాజశేఖర్, జిల్లా అధికార ప్రతినిధి సునీల్‌కుమార్, జిల్లా చేనేత విభాగం అధ్యక్షులు శివ తదితరులు పాల్గొన్నారు.

విద్యతోనే ఉజ్వల భవిష్యత్తు

నందవరం : విద్యతోనే ఉజ్వల భవిష్యత్తు లభిస్తుందని, ప్రతి విద్యార్థి చదువులో రాణించాలని వాల్మీకి సంఘం జిల్లా గౌరవ అధ్యక్షులు బాల వెంకటేశ్వర్లు, జిల్లా అధ్యక్ష కార్యదర్శులు మల్లన్న, సుధాకర్‌బాబు అన్నారు. ఆదివారం మండల కేంద్రంలోని బంగారమ్మ దేవాలయం ఆవరణలో వాల్మీకి సంఘం ఆధ్వర్యంలో దాతల సహకారంతో పది, ఇంటర్‌లో ప్రతిభ చూపిన విద్యార్థులను సత్కరించారు. మండలంలోని 7 ప్రభుత్వ పాఠశాలలో చదివి పదవ తరగతిలో ఉత్తమ మార్కులు సాధించిన 21 మంది విద్యార్థినీ, విద్యార్థులకు, ఇంటర్మీడియెట్ విద్యార్థినులు పవిత్ర, దీపికలకు మెమెంటోలు, బహుమతులు అందజేశారు. వారు మాట్లాడుతూ.. వాల్మీకులు ఐక్యంగా ఉండి తమ హక్కులను సాధించుకోవాలని సూచించారు. అలాగే తమ పిల్లలను ఉన్నత చదువులు చదివించేందుకు కృషి చేయాలన్నారు. దాతలు ఎస్ఐ రాజేశ్వరి, ఉపాధ్యాయులు ఉసేని, బంగారి, వీరస్వామినాయుడు, గిరిప్రసాద్, వీరేష్, రవిచంద్ర, కిరణ్‌కుమార్, సునిత, శివకుమార్, నరేంద్ర, భారతిల సహకారంతో విద్యార్థినీ, విద్యార్థులకు బహుమతులు అందించామన్నారు. కార్యక్రమంలో గ్రామ వాల్మీకి సంఘం పెద్దలు, నాయకులు వెంకటరెడ్డి, మాధవి, లక్ష్మణ, ఉసేని, లింగమూర్తి, రవి తదితరులు పాల్గొన్నారు.



వాల్మీకి ప్రతిభా పురస్కారాలతో విద్యార్థులు, దాతలు

వీర జవాన్ కుటుంబానికి మిత్రుల ఆర్థిక సాయం

పెద్దకడబూరు : పాకిస్థాన్ పోరులో అమరుడైన వీర జవాన్ మురళీ నాయక్ కుటుంబానికి మహానంది వ్యవసాయ కళాశాల పూర్వ విద్యార్థులు (2005 బ్యాచ్) ఆదివారం ఆర్థిక సహాయాన్ని అందజేశారు. పెద్దకడబూరు మండలంలో మండల వ్యవసాయ అధికారిగా పని చేస్తున్న ఎం వరప్రసాద్ మాట్లాడుతూ..మహానందిలో కళాశాలలో మురళీనాయక్ తమతో పాటు చదువుకున్నాడన్నారు. దీంతో తమ బ్యాచ్ మిత్రులు ఎం రమేష్ నాయక్ (వ్యవసాయ శాస్త్రవేత్త హైదరాబాద్), వ్యవసాయ అధికారులు ఇమ్రాన్, నరేష్‌లతో పాటు మిత్రులు అందరూ మురళీ నాయక్ సొంత గ్రామం కల్లి తండాకు వెళ్లి కుటుంబ సభ్యులను పరామర్శించి రూ.1.03లక్షలు ఆర్థిక సహాయాన్ని అందజేశామన్నారు. తమ మిత్రుడు నాయక్ మరణం తమను ఎంతో కలచివేసిందన్నారు. పాకిస్తాన్‌తో పోరు సమయంలో వీరోచితంగా పోరాడి 14మందిని చంపి శత్రువుల దొంగదెబ్బకు బలి అయిన మహా వీరుడు అని కొనియాడారు.



మురళీ నాయక్ కుటుంబాన్ని పరామర్శిస్తున్న మిత్రులు

శ్రీమఠంలో జబర్దస్త్ టీం సభ్యులు



మంత్రాలయం : శ్రీ రాఘవేంద్ర స్వామి దర్శనార్థం జబర్దస్త్ టీం సభ్యులు మంత్రాలయం విచ్చేశారు. జబర్దస్త్ టీం సభ్యులు ఫణి, ఆనంద్, బాబు, నాగతేజ ఆదివారం గ్రామ దేవత మంచాలమ్మకు మొక్కులు తీర్చుకున్నారు. అనంతరం రాఘవేంద్రుల మూల బృందావన దర్శనం చేసుకుని పూజలు నిర్వహించారు.

క్యాండిల్ లైట్ మెమోరియల్‌డే ర్యాలీ

ఆదోని రూరల్: ఆంధ్రప్రదేశ్ స్టేట్ ఎయిడ్స్ కంట్రోల్ సొసైటీ, జిల్లా ఎయిడ్స్ నియంత్రణ సంస్థ ఆధ్వర్యంలో ఆర్డీప్ సంస్థ వారు ఇంటర్నేషనల్ క్యాండిల్ లైట్ మెమోరియల్ డే ర్యాలీని ఆదివారం స్థానిక పురపాలక పాఠశాల నుంచి చేపట్టారు. ఈ సందర్భంగా విలియం క్యారీ ఏఆర్‌టీ మెడికల్ ఆఫీసర్ మాట్లాడుతూ ఎయిడ్స్ వ్యాధితో మరణించిన వారి ఆత్మశాంతి కోసం ఈ ర్యాలి నిర్వహించడం జరిగిందన్నారు. ఆర్డీప్ ప్రాజెక్ట్ మేనేజర్ మాలిక్, మెడికల్ ఆఫీసర్‌లు ప్రియాంకరెడ్డి, యల్లప్ప, డీఎస్ఆర్‌సీ కౌన్సిలర్ శివజ్యోతి, ఐసీటీసీ కౌన్సిలర్ వీరేంద్ర, సిబ్బంది పాల్గొన్నారు.

మాతృభూమి రుణం తీర్చుకోవాలి

ఆదోని సెంట్రల్: దేశ రక్షణలో యువత భాగస్వామ్యమై మాతృభూమి రుణం తీర్చుకోవాలని మున్సిపల్ మాజీ చైర్మన్ దేవరాజ్‌డోక, కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జ్ రమేష్‌యాదవ్ అన్నారు. ఆదివారం ఆదోని పట్టణంలోని ఎన్‌జీవోస్ కాలనీలో ఆర్మీ మేజర్ వినోద్‌ను పూలమాల, శాలువాతో సన్మానించారు. ఆర్మీలో మేజర్‌గా రాజస్థాన్‌లో విధులు నిర్వహిస్తూ సెలవుపై ఆదోనికి వచ్చిన వినోద్‌ను పలువురు అభినందించారు. మేజర్ వినోద్ మాట్లాడుతూ యువత లక్ష్యంతో చదివి ఆర్మీల ఉద్యోగాలు పొందితే ఉన్నత స్థాయికి చేరుకునే అవకాశం ఉందన్నారు. ఆర్మీలో చేరే వారికి తమవంతు సాయం అందిస్తానన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు దిలీప్‌డోకా, ఎన్ఎస్‌యూఐ రాష్ట్ర జనరల్ సెక్రటరీ శ్రీనిత్, చేతన్ తదితరులు పాల్గొన్నారు.



ఆర్మీ మేజర్‌ను సన్మానిస్తున్న నాయకులు

సేవల్లో సచివాలయ సిబ్బంది నిర్లక్ష్యం

ఎమ్మిగనూరుటౌన్: ప్రజల రేషన్ కార్డుల మంజూరు, వాటిలో చేర్పులు, మార్పుల లాంటి సేవలందించడంలో వార్డు, గ్రామ సచివాలయ అధికారులు నిర్లక్ష్యం వహిస్తున్నారని ఎన్ఎస్‌యూఐ జిల్లా అధ్యక్షుడు వీరేష్ యాదవ్ ఆరోపించారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ రేషన్ కార్డుల కోసం ప్రజలు దరఖాస్తులతో సచివాలయాలకు వెళితే సచివాలయ సిబ్బంది స్పందించడం లేదన్నారు. సమయ పాలన పాటించడం లేదని, సచివాలయాలకు వచ్చే ప్రజలకు సర్వర్ పనిచేయడం లేదంటూ నిర్లక్ష్యపు సమాధానాలు ఇస్తుండటంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. సంబంధిత శాఖ అధికారులు సచివాలయాలను తనిఖీలు చేసి ప్రజలకు ఇబ్బందులు లేకుండా సేవలు అందేలా చర్యలు తీసుకోవాలని కోరారు.

రథోత్సవానికి పోలీస్ బందోబస్తు

ఆదోని అర్బన్: పట్టణంలో సోమవారం జరగనున్న మహాయోగి లక్ష్మమ్మవ్వ 93వ వెండి రథోత్సవం సందర్భంగా పటిష్ఠ బందోబస్తు ఏర్పాటు చేసినట్లు ఆదోని డీఎస్పీ హేమలత తెలిపారు. ఆదివారం డీఎస్పీ కార్యాలయ ఆవరణలో పోలీసు సిబ్బందికి బందోబస్తుపై పలు సూచనలు, జాగ్రత్తలు తెలియజేశారు. సమావేశంలో సబ్ డివిజన్ ఆఫీసర్లు, సిబ్బంది పాల్గొన్నారు.

నేటి నుంచి పదో తరగతి సప్లిమెంటరీ పరీక్షలు

ఆదోని సెంట్రల్: ఆదోని, పత్తికొండ డివిజన్‌లోని 36 పరీక్షా కేంద్రాల్లో సోమవారం నుంచి 10వ తరగతి సప్లిమెంటరీ పరీక్షలు జరగనున్నాయని విద్యాశాఖ అధికారులు తెలిపారు. ఆదోని నియోజకవర్గంలో ఆరు పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేశారు. 4,500 మంది విద్యార్థులు పరీక్షలు రాయనున్నారు. ఉదయం 9.30 గంటల నుంచి మధ్యాహ్నం 12.45 గంటల వరకు పరీక్షలు జరగనున్నాయి.

నందవరం : సోమవారం 26వ తేదీ వరకు పదవ తరగతి సప్లిమెంటరీ పరీక్షలు నిర్వహిస్తున్నట్లు ఎంఈఓ రఘునాథ్ తెలిపారు. మండలంలో సప్లిమెంటరీ పరీక్షలు 370 మంది విద్యార్థులు రాయనున్నట్లు వివరించారు. స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను పరీక్ష కేంద్రంగా ఏర్పాటు చేసినట్లు తెలిపారు.